# ప్రకృతి-పురుషుడు



## చక్రపాణి

"ఇంకెన్నాళ్ళమ్మా నీ పెత్తనం? కూతుర్నిక సంసారం దిద్దుకోనివ్వరాదూ?" అని యెవరన్నా అంటే కస్తూరితల్లి రమామణి - "సారె! దానికి వదిలిపెడితే రొండుచేతుల్తో తినాల్సిందే;" "నోట్లో నాలికలేని ఘటం" - కాస్తె మెప్పుకువుబ్బితబ్బిబ్బులవుతుంది" "అడగనివాడిది పాపం, ఏదంటే అది పారవేస్తుంది!" ఇలా తలావొక సమాధానం చెప్పేది. ఇరవై యేళ్ళొచ్చినా కస్తూరికి సంసార మెలా గడుస్తున్నదో తెలియదు - కనీసం తెల్సుకోవాలనికూడా ప్రయత్నించలేదు. తల్లి చెప్పినట్టు నడుచుకోవడమే ఆమె పని నడుచుకోకమాత్ర

మేం చేస్తుంది? స్వబుద్ధి నుపయోగించి నప్పుడెల్లా తిట్లు తిన్నది!

యదృశ్యం తన్నశ్యం.

తన జ్ఞాపకార్థం రమామణి ఒక యిల్లూ రెండువందల రూపాయలూ మిగిల్చిపోయింది; ఇవికాక కస్తూరిశరీరం మీద పదితులాల బంగారం! ఈ మూల ధనంతో తనకు బొత్తుగా అనుభవంలేని జీవిత సంగ్రామం - కాదు వ్యాపారంలో దిగింది కస్తూరి. ఫలితం - రెండు సంవత్సరాలైనాక జమాఖర్చులు తేల్చు కుంటేగాక బాకీ యిల్లూ, కస్తూరీ-యెడారిలాంటి ఆమె జీవితమూ మిగిలింది.

ఇంట్లో కొంతభాగం కస్తూరి యిది వరకే అద్దె కిచ్చింది. కొంత భాగమని పేరుగాని యిల్లంతా వాడుకున్నా ఆమె యేమీ అనదు. అవసరమైతే తనూ వాళ్ళ కిచ్చిన భాగం వాడుకుంటూ వుండేది. వంటయిల్లు వేరే లేకపోవడం చేతనైతే నేమి ఏ కారణంవల్ల నైతేనేమి సంసా రంతో యెవరూ వచ్చివుండే వాళ్ళుకారు. పోతే కోర్టు వ్యవహారాలుండి వచ్చేవాళ్లూ, చికిత్స కొచ్చిన బాపతూ తాత్కాలికంగా వుండిపోతూ వుండేవాళ్ళు.

రామయ్యవచ్చి పదిరోజులైంది. కోర్టులో నాలుగైదు వ్యవహారాలు నడుస్తు న్నాయట. అందుకని నెలరోజులకి తీసు కున్నాడు గది. మొదటి రెండుమూడు రోజులు బయటి కెళ్లేటప్పుడు గదికి తాళంవేసి పోతూవుండేవాడు. కాని తర్వాత గొళ్ళెంవేసి కస్తూరిని చూస్తూ వుండమని చెప్పిపోయేవాడు. అతను పగలు ఇంట్లోవుండడు, ఉదయమే లేచి ప్లీడరుగారింటికి వెళ్ళేవాడు. సాయంత్రం కోర్టునించే యింటికి తిరిగివచ్చేవాడు. రాత్రి హోటలుకు పోవటానికి బద్ధకిస్తే కస్తూరే బతిమాలి భోజనం పెట్టేది.

ఒకనాడు రామయ్య కోర్టునించి పెందలాడే తిరిగివచ్చాడు. అతనికి తన గదివంక చూసేవరకూ ఆశ్చర్యమూ కోపమూ కలిగింది. దాన్నిండా పీక చుట్టలూ ఉమ్ములూ! రామయ్య, వాటి ఆధారంతో రీసెర్చి చేసుకుంటూ సృష్టి ఆదిదాకా పోయాడు. అతని కళ్ళముందు యెన్నో యుద్ధాలూ, రాజ్య ధ్వంసాలూ కనపడ్డాయి.

తనకొచ్చిన కోపాన్ని తాత్కాలికంగా దిగమింగి రామయ్య కస్తూరిని పిలిచి "ఏమిటిది" అని అడిగాడు.

"నరసయ్యగారు వొచ్చారు పొద్దున" అంది కస్తూరి.

"నర్సయ్యెవడు?"

"చేకూరు. రెండు మూడు నెల్లక్రితం యీ గదిలో వుండి పోయారు."

"ఉండి పోతే! ఇప్పుడు నా కింద వుండగా ఎందుకు రావాలి?"

"ఏదో యిదివరకున్న చోటుగదా అని చూసిపోటాని కొచ్చారు. నేనే వుండ మంటే కాసేపు వుండిపోయారు. అంత మాత్రానికి యేమెత్తుకుపోయారు? మీ




సౌమ్మ ! — ఐతే వుండండి, చుట్టపీక లూడ్చి శుభ్రంగా కడుగుతాను" అంటూ కస్తూరి చీపురుకోసం బయలుదేరింది.

రామయ్యకు ఎక్సుపార్టీ డిక్రీ యిచ్చి నట్లయింది. ఐనా "లా పాయింటు" వద లేదు.

"అదికాదు నేను అద్దె యిస్తూవుండగా యింకొకణ్ణెందుకు రానివ్వాలి నువ్వు ?" అన్నాడు

"చాల్లేండి. మీరూ నన్ను బాగానే ఆడిస్తున్నారు ! ఇంటికొచ్చిన మనిషిని అంత నిర్మొహమాటంగా యెట్లా పొమ్మన మంటారు ? రేపెప్పుడన్నా మీరు వస్తే అంతే చెయ్యమంటారా ?" అని నవ్వుతూ చీపురు తెచ్చి పరపర వూడ్చ నారంభిం చింది.

రామయ్య యిక మాట్లాడలేదు. తన లాపాయింట్లు కస్తూరిమీద పనిచెయ్యవని తెలుసుకున్నాడు.

మర్నాటి వుదయమే రామయ్య అద్దె లెఖ్ఖచూసిఇచ్చాడు కస్తూరికి. 'నెలరోజులు వుంటా మంటిరిగా ?' అన్నది కస్తూరి.

"కేసులన్నీ దీర్ఘ వాయిదాలు పడ్డయి. సాయంత్రమే ఇంటికిపోతాను" అన్నాడు. కస్తూరి మాట్లాడలేదు. రామయ్య పోయిన వేపు చూస్తూ నిట్టూర్చింది.

కాని సాయంత్రానికి రామయ్య మళ్ళీ తయారయాడు !

'వూరికి పోలేదేం ?' అన్నది, పొయ్యి దగ్గర కూర్చుని యెసరు వెకుతున్న కస్తూరి .

"సమన్లవి చేయించటానికి యింకా కొన్నాళ్ళు వుండాలన్నాడు ప్లీడరు."

కస్తూరి యికమాట్లాడలేదు. నిట్టూర్చి యింకో సోలెడు బియ్యం తెచ్చి యెసట్లో వేసింది.

— —